RNI NO.APTEL/2013/49614

శ్రీమతి కాకర్ల పద్మజ ప్రధాన సంపాదకత్వంలో

# రాజనీతి

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 13 | సంచిక : 169 | అన్నమయ్య జిల్లా | చీఫ్ ఎడిటర్ : కాకర్ల పద్మజ | ఆదివారం 28 జూన్ 2026 | పేజీలు : 04 | వెల : రూ. 2/-

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నర్యులేట్ కాలదుతూ ఆంధ్రప్రజలందరి మన్ననను పొందుతున్న రాజనీతి దినపత్రికకు జిల్లా వ్యాప్తంగా విలేకరులు కావలెను.

ఇతర వివరాలకు వెంటనే సంప్రదించండి:

కాకర్ల పద్మజ చీఫ్ ఎడిటర్

మొబైల్: 9618501530

## సీషెల్స్‌లో ప్రధాని మోదీకి ఘన స్వాగతం

### -'కచ్' నృత్యాలతో హోరెత్తించిన ప్రవాస భారతీయులు!

విక్టోరియా (సీషెల్స్), జూన్ 27 (రాజనీతి ప్రతినిధి): భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం శనివారం సాయంత్రం సీషెల్స్ దేశ రాజధాని విక్టోరియాకు చేరుకున్నారు. సీషెల్స్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ప్రధానికి ఆ దేశ అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినీ మరియు ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఘనంగా, సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు పరిసరాల్లో ప్రవాస భారతీయులు భారీ సంఖ్యలో చేరి 'మోదీ.. మోదీ' అంటూ నినాదాలు చేస్తూ, భారతీయ సంప్రదాయ 'కచ్' నృత్యాలతో ప్రధానికి అపూర్వ స్వాగతం పలికారు. ప్రవాస భారతీయుల సాంస్కృతిక అనుబంధంపై ప్రధాని మోదీ 'ఎక్స్' (ఢ) వేదికగా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా పలు కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ మరియు సీషెల్స్ అధ్యక్షుడు సంయుక్తంగా అక్కడి నేషనల్ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. అక్కడ ప్రపంచంలోనే అత్యంత వృద్ధ జీవిగా గుర్తింపు పొందిన 194 సంవత్సరాల అల్డాబ్రా జెయింట్ తాబేలు (జొనాథన్)



ను ప్రధాని ఆసక్తిగా వీక్షించి, దానికి ఆహారాన్ని తినిపించారు. అనంతరం అక్కడ ఒక మొక్కను నాటిన ప్రధాని.. ఆ తర్వాత ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.

## ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య ఒప్పందం




ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య ఒప్పందం కుదిరింది. వాషింగ్టన్ వేదికగా జరిగిన నాలుగు రోజుల చర్చల తరువాత అమెరికా, ఇజ్రాయెల్, లెబనాన్‌లు త్రైపాక్షిక ఫ్రేమ్‌వర్క్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేశాయి. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సమక్షంలో ఇజ్రాయెల్, లెబనాన్ రాయబారులు యెచియేల్ లీటర్, నాడా హమదేహ్, యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ డాన్ హోలర్‌లు అగ్రిమెంటుపై సంతకాలు చేశారు. ఇజ్రాయెల్, లెబనాన్ లోని హెజ్‌బొల్లా గ్రూప్‌తో కొన్ని నెలల పోరాటం తర్వాత విస్తృత ఒప్పందం కుదిరేందుకు ఇది ముందడుగుగా నేతలు అభివర్ణించారు. ఇరు దేశాల మధ్య శాంతి నెలకొనడానికి ఇది చాలా కీలక పరిణామమని మార్కో రూబియో పేర్కొన్నారు. అయితే పలు సవాళ్లను ఎదుర్కోవాల్సి రావచ్చని ఆయన హెచ్చరించారు. అయితే ఈ ముసాయిదా ఒప్పందం లోని అంశాలు వెల్లడి కాలేదు. ఈ ఒప్పందంలో మిలిటెంట్ గ్రూప్ హెజ్‌బొల్లాను చేర్చలేదు. దీంతో లెబనాన్‌లో అంతర్యుద్ధం తప్పకపోవచ్చని ఆ గ్రూప్‌నకు చెందిన ఓ నేత పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య కుదిరిన ఫ్రేమ్‌వర్క్‌తో క్రమంగా తాము వదిలేసిన భూభాగాలను లెబనాన్ ఆర్మీ బలగాలు స్వాధీనం చేసుకుంటాయని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం దక్షిణ లెబనాన్ లోని రెండు ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ బలగాలు క్రమంగా వీడుతాయి. ఇదే సమయంలో పైలట్ సెక్యూరిటీ అరేంజ్‌మెంట్‌లో భాగంగా ఆ ప్రాంతంలో లెబనాన్ బలగాలు మోహరించనున్నట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

## అందరికీ సంపూర్ణ ఆరోగ్యం కోసమే సంజీవని పథకం: సీఎం చంద్రబాబు



ప్రకాశం/గిద్దలూరు, జూన్ 27 (రాజనీతి ప్రతినిధి): రాష్ట్ర ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్య భద్రత కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన "సంజీవని" పథకాన్ని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు శనివారం ప్రారంభించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం కిష్టంశెట్టిపల్లిలో ఏర్పాటు చేసిన 'సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్'ను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఈ పథకం ఆరోగ్య రంగంలో ఒక గేమ్ ఛేంజర్ అని కొనియాడారు. 'మన మిత్ర' ద్వారా వేగవంతమైన వైద్య సేవలు నేరుగా ఇంటి వద్దకే అందుతాయని, ఆగస్టు 15 నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యువత అంతా క్వాంటమ్, ఏఐ (ఊ×) టెక్నాలజీలు నేర్చుకోవాలని, జనాభా సమతుల్యత కోసం "ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు" అనే విధానాన్ని ఆలోచించాలని సూచించారు. గత వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని, వారు కేవలం మూడు ముక్కలాట ఆడారని సీఎం చంద్రబాబు తీవ్రంగా మండిపడ్డారు. విజయవాడ సాయికృష్ణ కేసులో డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారిని లాగాలని కుట్రలు చేశారని ఆరోపించారు. హోం మంత్రి వంగలపూడి అనిత గారి మేకప్‌పై వైసీపీ మాజీ మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "రాజకీయాలకే అర్హత లేని ఆ గొడ్డలి పార్టీ ఆడబిడ్డలను అవమానిస్తోందని, ఇకపై ఎవరైనా ఆడబిడ్డల జోలికొస్తే వారికి రాష్ట్రంలో అదే చివరి రోజు అవుతుంది" అని ముఖ్యమంత్రి గట్టిగా హెచ్చరించారు.

## చిత్ర పరిశ్రమకు తీరని లోటు

### -ప్రముఖ దర్శకుడు భాగ్యరాజ్ మృతిపై డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతాపం!



అమరావతి (రాజనీతి ప్రతినిధి): ప్రముఖ చలనచిత్ర దర్శకుడు, నటుడు, రచయిత కె. భాగ్యరాజ్ గారి హఠాన్మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కల్యాణ్ గారు తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. భాగ్యరాజ్ గారు కన్నుమూశారనే వార్త తనను ఎంతో కలచివేసిందని పేర్కొంటూ.. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ గారు భాగ్యరాజ్ గారి సినీ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ.. ఒక సాధారణ రచయితగా, సహాయ నటుడిగా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత తమిళ చిత్ర పరిశ్రమలో దర్శకుడిగా, హీరోగా అద్భుతమైన గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆయన సృష్టించిన వైవిధ్యమైన కథలు, స్క్రీన్‌ప్లేలు తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో రీమేక్ అయి ఘనవిజయం సాధించాయని గుర్తుచేశారు. ముఖ్యంగా ప్రేమ, కుటుంబ అనుబంధాలను వెండితెరపై ఆయన మలిచిన తీరు ఒక తరం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందని శ్లాఘించారు. భారతీయ సినీ రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడుతూ, ఈ కష్టసమయంలో భాగ్యరాజ్ గారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఎస్‌బీఐ - తెలంగాణ ప్రభుత్వం మధ్య ముగిసిన భూ వివాదం




ప్రభుత్వానికి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాజమాన్యానికి మధ్య రాయదుర్గం భూముల విషయంలో నడుస్తున్న వివాదం ముగిసింది. ఇరు వర్గాల మధ్య జరిగిన చర్చలు విజయవంతం కావడంతో పరస్పర అంగీకారంతో కూడిన సయోధ్య కుదిరింది. జూన్ 22న జరిగిన మొదటి రౌండ్ చర్చల అనంతరం, కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే నిర్వహించిన రెండో సమావేశంలో ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం లభించింది. తొలి విడత చర్చల్లో భాగంగా జూన్ 23న తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ స్థలాలను ఎస్‌బీఐ ఉన్నతాధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ప్రభుత్వం చూపించిన కొత్త స్థలాలు బ్యాంక్ అవసరాలకు అనుకూలంగా ఉండటంతో, ప్రభుత్వ ప్రతిపాదనలకు ఎస్‌బీఐ సానుకూలంగా మొగ్గు చూపింది. ప్రభుత్వం ఆఫర్ చేసిన ఈ కొత్త ప్రతిపాదనలకు ఎస్‌బీఐ బృందం అంగీకారం తెలిపింది. ప్రభుత్వ ప్రతిపాదనలకు ఎస్‌బీఐ క్షేత్రస్థాయి బృందం అంగీకరించినప్పటికీ, దీనిపై తుది నిర్ణయం కోసం బ్యాంక్ తన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల అనుమతిని కోరనుంది. బోర్డు ఆమోదం లభించిన వెంటనే ఈ భూ బదిలీ ప్రక్రియ అధికారికంగా తదుపరి దశకు చేరుకుంటుందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. ఇరుపక్షాలు సమ్మతించడంతో ఈ వ్యవహారం వేగంగా ముందుకు సాగనుంది. ప్రస్తుతం ఈ భూ వివాదానికి సంబంధించిన కేసు కోర్టు పరిధిలో ఉన్నందున, న్యాయపరమైన ప్రక్రియలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తామని ఇరు వర్గాలు స్పష్టం చేశాయి. కోర్టు విచారణ కొనసాగుతున్న తీరుకు అనుగుణంగానే, అవసరమైన అన్ని చట్టబద్ధమైన , అధికారిక చర్యలను పూర్తి చేసి ఈ వివాదానికి పూర్తిగా తెరదించుతామని ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. అంటే.. తదుపరి విచారణలో ఎస్బీఐ తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటుంది.

## అమరావతి రైతుల పేరుతో వైసీపీ కొత్త డ్రామాలు: మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ధ్వజం!



అమరావతి (రాజనీతి ప్రతినిధి): రాష్ట్ర రాజధాని అమరావతి మరియు అక్కడి రైతుల పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సరికొత్త రాజకీయ డ్రామాలకు తెరలేపిందని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల తమ పాలనలో అమరావతిని సర్వనాశనం చేసి, భూములిచ్చిన రైతులను రోడ్డున పడేసి, లాఠీఛార్జీలతో హింసించిన వైసీపీ నేతలు.. ఇప్పుడు హఠాత్తుగా రైతులపై మొసలి కన్నీరు కారుస్తుండటం హాస్యాస్పదంగా ఉందని ఆయన విమర్శించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించేందుకు మరియు రైతులకు ఇచ్చిన అన్ని వాగ్దానాలను నెరవేర్చేందుకు అచంచలమైన నిబద్ధతతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఐదేళ్లపాటు ఉత్తర కుమార ప్రగల్భాలు పలికి, మూడు రాజధానుల పేరిట రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసీపీకి అమరావతి రైతుల గురించి మాట్లాడే కనీస నైతిక హక్కు లేదన్నారు. జగన్ మోహన్ రెడ్డి మరియు ఆయన పార్టీ నాయకులు ఆడుతున్న ఈ సరికొత్త రాజకీయ నాటకాలను, వారి ద్వంద్వ నీతిని రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా అమరావతి రైతాంగం గమనిస్తున్నారని, వారికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని మంత్రి హెచ్చరించారు.

## 'నేడే పల్స్ పోలియో'

రాజనీతి బ్యూరో (జూన్ 28): పోలియో రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పల్స్ పోలియో ఇమ్యునైజేషన్" కార్యక్రమం నేడు (ఆదివారం) జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా ప్రారంభమైంది. అప్పుడే పుట్టిన పసికందు నుండి ఐదు సంవత్సరాల లోపు వయసున్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (ృఎజ), ప్రభుత్వ ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, బస్టాండ్లు మరియు రైల్వే స్టేషన్లలో ప్రత్యేక పోలియో బూత్‌లను ఏర్పాటు చేశారు. గతంలో చుక్కలు వేయించినప్పటికీ, నేటి ప్రత్యేక డ్రైవ్‌లో మీ చిన్నారులకు మళ్లీ పోలియో చుక్కలు వేయించడం ద్వారానే పూర్తి రక్షణ లభిస్తుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. శాశ్వత అంగవైకల్యానికి కారణమయ్యే ఈ మహమ్మారిని తరిమికొట్టేందుకు తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ పిల్లలను దగ్గర్లోని పోలియో కేంద్రాలకు తీసుకెళ్లి చుక్కలు వేయించాలని, ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరుతున్నారు.

# అంగన్‌వాడీలకు సర్కార్ కానుక

**–ఉచితంగా ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రల పంపిణీ!**



పీలేరు, జూన్ 27 (రాజనీతి ప్రతినిధి): అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు పిల్లలు, గర్భిణులకు పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సరికొత్త విప్లవానికి శ్రీకారం చుట్టింది. పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు.. పీలేరు పట్టణం యలమంద క్రాస్‌లోని తలపల 2 సెక్టార్‌లో శనివారం అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత ఇండక్షన్ స్టవ్‌లు, నాణ్యమైన వంట పాత్రల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీలేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీ పురం రామమూర్తి అంగన్‌వాడీ నిర్వాహకులకు ఈ ఆధునిక కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పురం రామమూర్తి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అంగన్‌వాడీల ఆధునికీకరణకు పెద్దపీట వేస్తోందన్నారు. ఈ ఇండక్షన్ స్టవ్‌ల వాడకం వల్ల కాలుష్యం తగ్గడంతో పాటు ఇంధనం పొదుపు అవుతుందని, వంట సమయం కూడా భారీగా కలిసి వస్తుందని తెలిపారు. పీలేరు అంగన్‌వాడీ ప్రాజెక్టు సీడీపీఓ (జణూూ) రాజమ్మ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 44,346 అంగన్‌వాడీ కేంద్రాల కోసం రూ. 32 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం ఈ స్టవ్‌లను అందిస్తోందన్నారు. దీనివల్ల పొగ బెడద ఉండదని, ఆయాలకు వంట చేయడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. పీలేరు ప్రాజెక్టు పరిధిలోని 223 కేంద్రాలలో మొదటి విడతగా 24 సెంటర్లకు వీటిని అందజేశామని, మిగిలిన వాటికి త్వరలోనే పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోళ్ళ కిషోర్ నాయుడు, సూపర్‌వైజర్ అక్కయ్య, స్థానిక నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి భేటీ



రాయచోటి/చిత్తూరు, జూన్ 27 (రాజనీతి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ ని అన్నమయ్య జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ధీరజ్ కునుబిల్లి, ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరులో శుక్రవారం రాత్రి డీజీపీ అధ్యక్షతన జరిగిన పోలీసు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి అన్నమయ్య జిల్లా ఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా గారికి ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పూలమొక్కను అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా భద్రత మరియు నేరాల అదుపుపై జరిగిన విస్తృత స్థాయి సమీక్షలో డీజీపీ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అత్యంత పారదర్శకమైన, వేగవంతమైన పోలీసింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించే అసాంఘిక శక్తుల పట్ల మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని, ఎక్కడా రాజీ పడకుండా కఠినంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఎస్పీతో పాటు ఇతర ఉన్నతాధికారులను డీజీపీ ఆదేశించారు.

# పోలియో రహిత రేపటి కోసం రెండు పోలియో చుక్కలు : డా: శ్రీ గిరీష



రాజనీతి బ్యూరో (జూన్ 27): పోలియో వ్యాధి శాశ్విత అంగవైకల్యానికి కారణమయ్యే వైరస్ కారక ప్రమాదకారి అని నిర్మూలనకు రెండు పోలియో చుక్కలు అప్పుడే పుట్టిన బిడ్డనుండి ఐదు సం: లోపు ప్రతి చిన్నారికి వేయించండని తలుపుల పిహెచ్ సి ప్రదానవైద్యాధికారులు డా: గిరీష్ డా: చంద్రశేఖర్ సంయుక్తంగా తెలిపారు. "రేపే పోలియో ఆదివారం" అంశముపై పీలేరు యల్లమంద క్రాస్ లో పాఠశాల విద్యార్థులచే మరియు తలుపుల పురవీధుల్లో ఆరోగ్య బృందం చే అవగాహన ర్యాలీ నిర్వహించారు. 0 – 5 సంవత్సరాల పిల్లలకు అందరికీ దగ్గర్లోనే పోలియో బూతులో చుక్కలు వేయించి, పోలియో మహమ్మారి నుండి మీ బిడ్డల రక్షించాలని వైద్యాధికారులు ఈ సందర్భంగా తెలియజేశారు. రేపే పోలియో ఆదివారం నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అని నినాదాలు చేస్తూ ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య, పీహెచ్ యన్ కుసుమ,పర్యవేక్షణ అధికారులు శ్రీనువాసులు, నాగమ్మ,ఏయన్ఎం భార్గవి, లక్ష్మీ,సిహెచ్ఓ లు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రత, పరిశుభ్రత, నాణ్యమైన సేవలపై రాజీ లేదు

**–వసతి గృహాలు, గురుకులాల్లో ప్రమాణాలు ఖచ్చితంగా అమలు చేయాలి -- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



మదనపల్లి, జూన్ 27: శనివారం మదనపల్లి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో... సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్ శాఖలు, అంబేద్కర్ గురుకులాల జిల్లా సమన్వయ అధికారులతో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతి, ఆహారం, పరిశుభ్రత, భద్రత, విద్యా ప్రమాణాలు కల్పించే దిశగా పలు ఆదేశాలు జారీ చేశారు. వసతి గృహాలు, గురుకులాల్లో ప్రభుత్వం సూచించిన విధంగా "ముస్తాబు కార్యక్రమం" సమర్థవంతంగా అమలు చేయాలని, పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బయట ఆహారాన్ని పూర్తిగా నిషేధించాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ హాస్టల్ వెల్ఫేర్ అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించి ఫుడ్ టేస్ట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. వంటశాలలు, డైనింగ్ హాల్స్, హాస్టల్ ప్రాంగణాల్లో పరిశుభ్రత పాటించాలని, వంట సిబ్బందికి పోషకాహారం, వంట విధానాలు, పరిశుభ్రతపై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి హాస్టల్‌లో తాగునీటి నాణ్యతను రెండు స్థాయిల్లో పరీక్షించాలని, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు వేగవంతం చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్‌తో శుభ్రపరచాలని సూచించారు. నీటి పరీక్షలు, ట్యాంకుల శుభ్రత రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. పారిశుధ్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. అవసరమైన ఎస్‌బీఎం మరుగుదొడ్ల వివరాలను సమర్పించి, పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వసతి గృహాల్లో దోమల నివారణ చర్యలు, భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. పనిచేయని సీసీ కెమెరాలను వెంటనే మరమ్మతు చేసి కనీసం మూడు నెలల వీడియో నిల్వ సామర్థ్యంతో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థుల అడ్మిషన్లు మంజూరైన సామర్థ్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని, పాఠశాలల ద్వారా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు తదితర స్కూల్ కిట్లు అందుతున్నాయో లేదో హాస్టల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అనుభవజ్ఞులైన ట్యూటర్ల నియామకం, స్టడీ అవర్స్ పర్యవేక్షణ, ముఖ్యంగా 9వ, 10వ తరగతి విద్యార్థులకు వారాంత పరీక్షలు నిర్వహించి మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పారిశుధ్యం తదితర అంశాలపై నిర్దేశిత నమూనాలో సమాచారం జిల్లా స్థాయి అధికారులకు పంపించాలని, ఉదయం 8 గంటలలోపు సమగ్ర నివేదిక జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందించాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పిఎండిఎస్ విధానాన్ని సాగు చేస్తున్న మహిళ రైతులు



సుండుపల్లి జూన్ 27: సుండుపల్లి మండలం తిమ్మసముద్రం గ్రామంలోని మహిళా సంఘ సభ్యులు ప్రకృతి వ్యవసాయ విధానంలో లెనినో ప్రభావాన్ని తట్టుకునే పంటలు సాగు చేసుకునే క్రమంలో భాగంగా పీఎం బీఎస్ విధానాన్ని మహిళా రైతులు సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణంలో వచ్చే మార్పును తట్టుకొని పశువుల మేత కొరకు అదేవిధంగా పాల దిగుబడిని పెంచుకోవడానికి పొలాన్ని నత్రజని భాస్కరము భూమిలో ఉన్న కర్బన శాతం పెంచుకోవడానికి మరియు వాతావరణంలో కలిగే మార్పులను తట్టుకొని సాగు చేసుకునే క్రమంలో వడ్లపల్లికి చెందిన స్రవంతి గ్రూప్ నాగవేణి సభ్యురాలు మరియు మహాలక్ష్మి గ్రూప్ సభ్యులు పరుచూరి దీప రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో పిఎండిఎస్ విధానం రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న ఈ పథకం ద్వారా ఎంతో ఉపయోగంగా ఉంటుందని మండలంలోని రైతులందరూ డ్వాక్రా సంఘ సభ్యుల ద్వారా ముందుకు తీసుకెళ్లాలని తెలపడం జరిగింది ఈ సందర్భంగా ఎఫ్ఎమ్టిఎం రామ్మోహన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేద్దాం పుడమి తల్లిని కాపాడుదాం ప్రపంచము చూపు ప్రకృతి వ్యవసాయం వైపని తెలపడం జరిగింది.

# ఆంజనేయ స్వామికి అభిషేక పూజలు



సుండుపల్లి జూన్ 27: మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామ బహుదానది ఒడ్డున వెలసి ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి తిరుణాల ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు ఉదయం పుణ్యాహవాచనం ధ్వజారోహణ నవగ్రహ పూజలు అభిషేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు అలాగే పక్కనే ఉన్న ఏపూరి అమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు ఎదురుగా ఉన్న చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో స్వామివారి నీ ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు రాత్రి మునిలక్ష్మి భాగవతారనిచే హరికథా కాలక్షేపం నిర్వహించారు నేటి ఉదయం ఆంజనేయునికిఅభిషేకం నిర్వహించి భక్తులచే అన్నదానం రాత్రికి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

# శ్రీ సత్యసాయి జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా మార్చడమే లక్ష్యం



పుట్టపర్తి, జూన్ 27: శ్రీ సత్యసాయి జిల్లాను పూర్తిగా మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారి సతీష్ కుమార్ అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం పుట్టపర్తి కలెక్టరేట్‌లో నిర్వహించిన నార్కోటిక్స్ సమన్వయ కమిటీ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో వారు కీలక సూచనలు చేశారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలు మరియు ఇతర నిషేధిత మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మాదకద్రవ్యాల సరఫరా వ్యవస్థను గుర్తించి పూర్తిగా ధ్వంసం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టేందుకు సంప్రదాయ తనిఖీలతో పాటు ఆధునిక నిఘా వ్యవస్థలను వినియోగించాలని సూచించారు. జిల్లాలో గతంలో నమోదైన గంజాయి, మత్తు పదార్థాల కేసుల్లో నిందితులు, రవాణాదారులు, మధ్యవర్తులపై పోలీసు, ఎక్సైజ్ శాఖలు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దుల గుండా ఇతర ప్రాంతాల నుంచి మత్తు పదార్థాలు జిల్లాలోకి ప్రవేశించకుండా చెక్‌పోస్టుల వద్ద నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా కళాశాలలు, పాఠశాలల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, విద్యాశాఖ సహకారంతో యువతకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పోలీసు, ఎక్సైజ్ శాఖలు పరస్పర సమన్వయంతో ఉమ్మడి దాడులు నిర్వహించి జిల్లాను పూర్తిగా మాదకద్రవ్యాల రహితంగా మార్చాలని జిల్లా పోలీసు అధికారి సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ ప్రసాద్, జిల్లా మద్యనిషేధ మరియు ఎక్సైజ్ అధికారి గోవింద నాయక్, సహాయ ఎక్సైజ్ అధికారి నరసింహులు, కమిటీ సభ్యులు, వివిధ ప్రాంతాల పోలీసు అధికారులు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యం : జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



గుర్రంకొండ, జూన్ 27: జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యం. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయి పారదర్శకత, నిష్పాక్షికతతో నిర్వహించి తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించే దిశగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శనివారం గుర్రంకొండ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలు నెం.16, 17 పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బూత్ లెవల్ అధికారులు (దీూలు) నిర్వహిస్తున్న సర్ ఏన్యుమరేషన్ ఫారాల పంపిణీ, నమోదు ప్రక్రియ, ఓటరు వివరాల సేకరణ, ఆన్‌లైన్ డిజిటలైజేషన్ పనితీరును పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..., ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకత అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రతి అర్హ ఓటరికి సంబంధించిన సమాచారం సక్రమంగా నమోదు చేసి, సేకరించిన వివరాలను ఆలస్యం లేకుండా డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. బీఎల్ఓలకు కేటాయించిన విధులు, బాధ్యతలను వారే వ్యక్తిగతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పనులను అనధికార వ్యక్తులకు అప్పగించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే ఓటర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు, సంబంధిత వర్గాలందరితో సమానత్వం, నిష్పాక్షికత పాటిస్తూ వ్యవహరించాలని తెలిపారు. ఓటరు జాబితాపై ఎలాంటి ఫిర్యాదులు, అభ్యంతరాలు వచ్చినా వెంటనే పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేసి, ప్రతి అర్హ ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో ర్యాలీ నిర్వహించిన పి.హెచ్.సి చెంబకూర్




చెంబకూర్: పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలం చేయడం కోసం పి.హెచ్.సి చెంబకూర్‌లో పల్స్ పోలియో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మెడికల్ ఆఫీసర్ డా. పి. జహ్నవి నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ టి.వి. రమణ, ఎంపీహెచ్ఎస్ (ఎఫ్) కె. కుతీజా, **ANMs, CHOs, ASHA** వర్కర్లు పాల్గొన్నారు. పల్స్ పోలియో టీకాల ప్రాముఖ్యతను ప్రజలకు అవగాహన కల్పించడం, 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో టీకాలు వేయించుకోవాలని ప్రజలను అవగాహన చేయడం ఈ ర్యాలీ లక్ష్యం. ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది ప్రజల మధ్య నడుస్తూ స్లోగన్లు చెప్పి, పోలియో టీకాల ప్రయోజనాలను వివరించారు. ప్రతి బాలుబాలికలు పల్స్ పోలియో టీకాలు తప్పనిసరిగా తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజలలో పోలియో నిర్మూలన పట్ల అవగాహన పెరిగిందని అధికారులు తెలిపారు.

## ప్రముఖ నటుడు, దర్శకుడు భాగ్యరాజ్ కన్నుమూత!!!



తమిళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు, దర్శకుడు కె. భాగ్యరాజ్ (73) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆకస్మిక గుండెపోటుతో చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1953లో ఈరోడ్ జిల్లా వెల్లాంకోయిల్లో జన్మించిన భాగ్యరాజ్, ప్రముఖ దర్శకుడు భారతిరాజా వద్ద సహాయ దర్శకుడిగా సినీ ప్రస్థానం ప్రారంభించి, అనంతరం నటుడిగా, దర్శకుడిగా ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించారు. ఇటీవల భారతిరాజా మరణించగా, ఇప్పుడు ఆయన శిష్యుడు భాగ్యరాజ్ కూడా కన్నుమూయడం తమిళ సినీ పరిశ్రమను విషాదంలో ముంచెత్తింది.

# పారిశ్రామిక పార్కుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలి

**-భూ బ్యాంక్ అభివృద్ధిపై దృష్టి సారించాలి**

**-ఎంఎస్ఎంఈ పార్కుల పనులు వెంటనే ప్రారంభించాలి**

**-జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



మదనపల్లి, జూన్ 27: అన్నమయ్య జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు... పారిశ్రామిక పార్కుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మదనపల్లి కలెక్టరేట్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపీఐఐసీ అధికారులు, సబ్ కలెక్టర్, ఆర్డీఓ తదితరులతో జిల్లాలోని పారిశ్రామిక పార్కుల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక పార్కుల స్థితిగతులు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార చర్యలపై సంబంధిత జోనల్ మేనేజర్లతో చర్చించారు. జిల్లాలోని రాయచోటి నియోజకవర్గం శిబ్యాల మరియు తంబళ్లపల్లి నియోజకవర్గం కుక్కరాజుపల్లి ప్రాంతాల్లో ప్రతిపాదిత ఎంఎస్ఎంఈ పార్కుల పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పార్కులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత సబ్ కలెక్టర్, ఆర్డీఓ, జోనల్ మేనేజర్లకు సూచించారు. అలాగే జిల్లాలో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పేందుకు అవసరమైన భూ బ్యాంక్ అభివృద్ధిపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. పారిశ్రామిక పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్డీవో శ్రీనివాస్, ఏపీఐఐసీ జెడ్ ఎం సుబ్బారావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

**-విద్యుత్ ప్రమాద బాధితుడికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి భారీ ఆర్థిక సాయం!**



రాజంపేట/పీలేరు, జూన్ 27 (రాజనీతి ప్రతినిధి): "ఆపదలో ఉన్నప్పుడు అండగా నిలిచి, సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి కొండంత భరోసా ఇవ్వడమే నిజమైన ప్రజాసేవ" అని రాజంపేట పార్లమెంట్ సభ్యులు శ్రీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి గారు మరోసారి నిరూపించారు. ఇటీవల జరిగిన ఒక ఘోర విద్యుత్ ప్రమాదంలో తన కాళ్లు, చేతులు కోల్పోయి, జీవితంపై ఆశలు వదులుకున్న తువగుంటపల్లి గ్రామానికి చెందిన బాధితుడు టి. దేవేంద్ర కుటుంబానికి ఎంపీ మిథున్ రెడ్డి దేవుడిలా అండగా నిలిచారు. బాధిత కుటుంబం తమకు సహాయం చేయాల్సిందిగా ఎంపీ గారిని ఆశ్రయించగా, ఆయన తక్షణమే మానవత్వంతో స్పందించారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల నుండి ప్రత్యేకంగా రూ. 6.35 లక్షల భారీ బడ్జెట్‌ను కేటాయించి, బాధితుడికి అత్యాధునిక ఆర్టిఫిషియల్ (కృత్రిమ) చేయి మరియు కాలును విజయవంతంగా అమర్చించారు. కృత్రిమ అవయవాలు అమర్చిన అనంతరం దేవేంద్ర కుటుంబ సభ్యులు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రమాదంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న తమను ఆదుకుని, దేవేంద్రకు పునర్జన్మ ప్రసాదించిన 'మిథున్ అన్న'కు తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందని వారు భావోద్వేగానికి గురయ్యారు. నియోజకవర్గంలో పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ఎక్కడ ఏ కష్టం వచ్చినా తక్షణమే స్పందిస్తూ, ప్రజా హృదయాలలో చెరగని ముద్ర వేసుకుంటున్న రాజంపేట ఎంపీ గారిని స్థానిక ప్రజలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు "మానవతావాది మా మిథున్ అన్న" అంటూ కొనియాడుతున్నారు.

# ఈసీ నిబంధనల ప్రకారమే SIR-2026 నిర్వహించాలి

**- డీఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి కఠిన ఆదేశాలు**

మదనపల్లె, జూన్ 27 (రాజనీతి ప్రతినిధి): రాష్ట్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహణలో భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను నూటికి నూరు శాతం అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (ఐ=ా) మరియు ఉప జిల్లా ఎన్నికల అధికారి శ్రీ చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఓటరు నమోదు ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికత పాటించాలని జిల్లాలోని ఎన్నికల నమోదు అధికారులు (జు=ాం), సహాయ ఎన్నికల నమోదు అధికారులను ఆదేశించారు. ఈనెల 27, 28 తేదీలలో బీఎల్ఓలు అందరూ తమ పరిధిలోనే ఉంటూ ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించాలని, ఏన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు తక్షణమే డిజిటలైజేషన్ పూర్తి చేయాలన్నారు. తమకు కేటాయించిన అత్యంత కీలకమైన బాధ్యతలను అధికారులే వ్యక్తిగతంగా నిర్వహించాలని, ఎలాంటి అనధికార లేదా ప్రైవేట్ వ్యక్తులకు ఈ పనులు అప్పగించరాదని తేల్చి చెప్పారు. ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలపై అప్రమత్తంగా ఉంటూ, ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించాలని డీఆర్ఓ సూచించారు. క్షేత్రస్థాయి తనిఖీలలో నిబంధనలకు విరుద్ధంగా నిర్లక్ష్యం వహించినట్లు తేలితే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

## ఆసుపత్రిలో అందుతున్న ఉచిత వైద్య సేవలను పరిశీలించిన డాక్టర్ పి. లోకవర్ధన్



రాయచోటి, జూన్ 27 (రాజనీతి ప్రతినిధి): అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాల (ఏరియా హాస్పిటల్) ను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ పి. లోకవర్ధన్ శనివారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్య పథకం అమలు తీరును ఆయన క్షేత్రస్థాయిలో కూలంకషంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులలో చికిత్స పొందుతున్న రోగులను ఆయన వ్యక్తిగతంగా పరామర్శించారు. ఉచిత వైద్యం, అందుతున్న మందులు, వైద్యుల సంరక్షణపై రోగులను అడిగి తెలుసుకోగా, వారంతా పథకం ద్వారా అందుతున్న వైద్య సేవల పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాయచోటి పరిధిలో నడుస్తున్న 104 సంచార వైద్య వాహన సేవలను కూడా ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఈ ఉచిత వైద్య సేవలను మరియు మందులను సామాన్య ప్రజలందరూ పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని డాక్టర్ లోకవర్ధన్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## పీలేరులో రేపు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పర్యటన

పీలేరు: నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సోమవారం (29-06-2026) పీలేరు మండలంలో పలు అధికారిక, ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఎమ్మెల్యే కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 9:00 గంటలకు చిత్తూరు రోడ్డులోని వీజీ= ఇంజనీరింగ్ కాలేజ్ పక్కన గల "మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల"లో విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. అనంతరం ఉదయం 10:00 గంటలకు పీలేరు-కడప రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన "కాసం ఫ్యాషన్స్" షోరూమ్‌ను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాల్లో పీలేరు మండల పరిధిలోని సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, ాావీజ చైర్మన్లు, డైరెక్టర్లు, క్లస్టర్ ఇంచార్జీలు, కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) పార్టీల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యూనిట్ ఇంచార్జీలు, బూత్ కన్వీనర్లు, గ్రామ, పట్టణ కమిటీల అధ్యక్షులు, కార్యకర్తలు మరియు నల్లారి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయం కోరింది.

Printed, Published & Owned by Smt.kakarla padmaja, Published at Do.No.3-267/5, Ragavendra Colony, Greemspeta, Chittoor Dist, Ap. and Printed at Prajasakthi Press, Renigunta road, Tirupati, Chittoor, A.P. Editor : N.Nagaraju, RNI No. APTEL/2013/49614